
# దూరపు కొండలు



కోనమంచి సత్యనారాయణ

* * * * * *

**అతడు అదృష్టవంతుడు. కన్న బిడ్డల చేతుల్లో హాయిగా కన్ను మూశాడు — వాళ్ళు కూడా సక్రమంగా అన్ని కర్మలూ ఆచరించారు. దేనికైనా పెట్టి పుట్టాలి — అంటారు లోకులు. అతడి ఆత్మ మాత్రం 'లోకులు... దూరపు కొండలు' అనుకుంటూ నవ్వుకొని ఉంటుంది.**

* * * * * *

"పరంధామయ్యా కేమిటోయ్, అదృష్టవంతుడు!" ఈ మాటలు పరంధామయ్యకి కొత్తకావు. పంథొమ్మిదేళ్ళ ప్రాయంలో డిగ్రీ తీసుకుని, కలెక్టరాఫీసులో ఉద్యోగం చేసినప్పుడు లోకు లన్న మాటలే ఇవి!

ముచ్చటగా ఇద్దరు మగపిల్లల్నీ, ఒక ఆడపిల్లని కన్నప్పుడుకూడా లోకులు ఇదే మాట అన్నారు.

పెళ్ళాం పోయిన కొద్ది రోజులకు ముప్పై వేలు పెట్టి అల్లుణ్ణి కొన్నప్పుడు, పెద్దకొడుకు సూర్యాన్ని మెడిసిన్ చదివించినప్పుడు, చిన్నకొడుకు ప్రకాశాన్ని లాయరు చేసినప్పుడు కూడా ఈ మాటలే అన్నారు లోకులు!

అరవయ్యోపడిలో పడి ఆరెకరాల మాగాణికి, అధునాతనమైన అందమైన డాబాకు, మూడెకరాల చెరుకు తోటకు యజమాని అయినప్పుడు కూడా లోకు లన్న మాటలుకూడా ఇవే!

"నీ జీవితానికేమిటోయ్, పంచకల్యాణి కదూ! కడుపులో చల్ల కదలకుండా, చివరి రోజుల్లో కృష్ణా రామా అనుకుంటూ కాలుమీద కాలేసుకుని కూచున్నావు—పెట్టి పుట్టాలమకో!" పరంధామయ్య ఇచ్చిన పొగాకుకాడ రొంటిని పెట్టుకొంటూ పక్కింటి శివరామయ్యగారు ప్రతిరోజూ ఈ మాట అనడం, వాలుకుర్చీలో కూర్చుని చిరునవ్వుతో తల పంకించటం పరంధామయ్యకు అలవాటే!

"ఎవడి ట్లాలు ఆడి కుంటాంయిలే, బాబయ్యా! మాయదారి కాలం అత్తారామా ఒకలాగే ఉంటదేటి? అయినా నూసేదంతా నిక్కవే నను కుంటే కట్టమే మరి!" పాతిక సంవత్సరాలనుండి పరంధామయ్యను అంటిపెట్టుకుని ఆలనా పాలనా చూసే రామన్న కొన్ని చేదునిజాల్ని బయట పెట్టడంకూడా కద్దు!

ఏది ఏమైనా పరంధామయ్య ఇప్పటి వరకూ అందరూ అనుకున్నట్లు అదృష్టవంతుడనే చెప్పక తప్పదు.

ఏడాదిలో తొమ్మిది నెలలు తన సంతానం దగ్గిర గడుపుతాడు. మిగతా మూడు నెలలూ సొంత డాబాలో మకాం! డాబా పల్లెటూరిలో కట్టినా పట్టణవాసపు హంగులన్నీ దాని కున్నాయి! సొంతఊరిపై మమకారం కొద్దీ పొలాలూ, చెరుకుతోటా అక్కడికి దగ్గిరలో ఉండటంవల్ల పరంధామయ్య ఆ డాబాలో మూడు నెలలు ఉంటాడు!

పరంధామయ్య లేనప్పుడు రామన్న ఆ ఇంటిని అంటిపెట్టుకుని ఉంటాడు.

"ఏంరా, సూర్యం! ఏమంటావ్? డాబా ఎంత లేదన్నా అరవై వేలు చేస్తుంది. ఇంటికి పెద్దవాడివి. నా తరవాత నువ్వు అందులో ఉండాలని నా అభిమతం. అందుకే నీ కది వ్రాశాను. నాలుగెకరాలు చిన్నవాడికీ, తోట సరళకీ వ్రాశాను. మిగతా రెండెకరాలూ ప్రస్తుతం నాకు ఉంచుకుని నా అనంతరం ఒక ఎకరం వెంకటేశ్వర స్వామికి, ఓ కటి రామన్నకు చెందేట్లు రాశాను. ఇది మీ కందరకూ ఆమోదమే ననుకుంటాను." మెల్లిగా పరంధామయ్య ఈమధ్య వ్రాసిన విల్లు విషయం పెద్దకొడుకు చెవిలో వేశాడు.

"రాసేశారుగా! సరే. మీ ఇష్టం వచ్చినట్టుగా చేశారు!" అప్పటికి మాత్రం సమాధానం చెప్పాడు సూర్యం.

కాని సూర్యం మొహంలోని అసంతృప్తిని పరంధామయ్య కనిపెట్టక పోలేదు. సంప్రతించకుండా విల్లు వ్రాసేశానని కాబోలు కోపం అని సరిపెట్టుకున్నాడు.

"బోడి డాబా! నెత్తివేసి రుద్దుకోవాలి! రామన్న ఏమన్నా కన్నబిడ్డా? కూలివాళ్ళకు, గుళ్ళో ఉండే రాతివిగ్రహాలకు సైతం ఆస్తి వ్రాసేటంత గడించారా మామగారు? పెద్దకొడుకు కదా! నెత్తిమీద కొరివి పెట్టేవాడని కొంచెం ఎక్కువ వ్రాయాలనే ధ్యాస ఆయనకు ఉండక్కర్లా? ఆడపిల్లలతో సహా అందరకూ ఆస్తి సమానంగా పంచారు. మిగతా రెండెకరాలుకూడా మా కివ్వమనండి. కావలిస్తే చచ్చేదాకా మన దగ్గి, రుండమనండి."

"అబ్బా, ఊరుకోవే! వింటారు కూడాను. మిగతా రెండెకరాలుకూడా అడుగుతాను. లేకపోతే రామన్ననా

గొప్పనూకూడా ఇక్కడే ఉండమని చెబుతానులే!"

కొడుకు, కోడలు పడకగదిలో అనుకునే మాటలు వినకూడదనుకున్నా పరంధామయ్యగారి చెవిలో దూరాయి. తొలిసారిగా నిర్ఘాంత పోయాడు!

• • •

"నీ కిష్టమే ననుకుంటాను!"

"అన్నయ్యకు డాబా వ్రాశారు. నాకు పొలం ఇచ్చారు. మిగతాది మీరు ఉంచుకున్నారు. అంతా బాగానే ఉంది. కాని. . ."

"నీ సందేహం నా కర్థం కావటం లేదు."

"ఏం లేదు, సరళకుకూడా తోట వ్రాశారు. . ."

"అవును. ఇంటికి ఒకే ఒక్క ఆడపడుచుకదా! ఎంత లేదన్నా ఆమాత్రం ఇవ్వటం ధర్మం."

"అదికాదు, నాన్నా! దాని పెళ్ళయి అప్పుడేనాలుగేళ్ళవుతూంది. అదిఇప్పుడు మీ కూతురు కాదు. భర్త అజమాయిషీలో ఉంది. అదీకాక దాని పెళ్ళికి కట్నం ముప్పై వేలయింది. పెళ్లి ఖర్చులకు మరో పదివేలు. ఇప్పుడు తోట ఖరీదు ఎంత లేదన్నా పాతికవేలు పైనే ఉంటుంది. . . మొత్తం అరవై అయిదు వేలయింది."

"ఇంతకీ నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"ఉద్దేశ్యమేకేం లేదు. పెళ్ళయి పోయిన తరవాత ఆడపిల్లలకు ఆస్తి ఇవ్వటం అనవసరం. దానికి ఇవ్వవలసింది ఇదివరకే ముట్టింది. ఇప్పుడు మళ్లీ తోట వ్రాయటంలో అర్థం లేదు. మీ కంతగా ఇవ్వాలనుకుంటే ఓ పది వేలు ఇస్తే పోలా!"

ప్లీడరు ప్రకాశం తన వాదనా పటిమతో కన్నతండ్రి పరంధామయ్యకు చక్కని సలహా ఫీజు లేకుండా ఇచ్చాడు!

• • •

"నీకు తోట వ్రాశానమ్మా!"

"తోటా?"



చిత్రలేఖనం

ఫొటో — భరద్వాజ (మద్రాస్ - 18)

"ఏం?"

"తోట నేనేం చేసుకుంటాను, నాన్నా?"

"అదేమిటమ్మా, అలా అంటావు! ఆ తోట కొన్నతరవాతే మనకు అదృష్టం తిరిగిందమ్మా! ఈనాడు మనం చల్లగా ఉండటానికి ఆ తోటే కారణం! ఇంటి ఆడపడుచుకి పచ్చగా మెరిసిపోయే పండంటి తోట ఇవ్వాలమ్మా!"

"ఏం అదృష్టమోలే, నాన్నా! అది చెరుకుతోట కాదు, చొప్పతోట అంటారు ఆయన! రెండేళ్ల నుంచీ ఓ మంచి డాబా కట్టాలని ఆయన ప్రయత్నం. . . అన్నయ్య చదువులకి బోలెడు ఖర్చైంది గదా!. . . ఇప్పుడు కూడా వాళ్లకంటే నాకే తక్కువ వ్రాశారు!"

"అదేమిటమ్మా! వాళ్ల చదువులకు ఖర్చుపెట్టిన దానికంటె నీ పెళ్లికి ఖర్చైందే ఎక్కువమ్మా!"

"ఏమో, నాన్నా! నాకు నీ విల్లు నచ్చలేదు." నిష్కర్షగా అసంతృప్తి మెరిసే కళ్లతో మూతి ముడుచుకుంది సరళ!

• •

"నా అనంతరం నీకు ఒక ఎకరం సంక్రమించేటట్లు వ్రాశాను, రామన్నా!" తన ఆస్తిలో నాలుగవ భాగస్వామికి తన విల్లు వివరించారు పరంధామయ్య గారు.

రామన్న కళ్లలో కృతజ్ఞతా కుసుమాలు విరబూచాయి.

ఆనంద, హర్ష ద్రాక్షల గుత్తులు విరివిగా కాశాయి.

"కూలోణ్ణి! తమ కాళ్లకాడ బతికే వోణ్ణి నాకు ఎకరం ఎందుకు, బాబయ్యా!" అనే భావం వ్యక్తం చేశాడు రామన్న.

పరంధామయ్యకు కొంత తృప్తి కలిగింది.

మరోసారి రామన్న కళ్లలోకి సూటిగా చూశాడు.

'నా పాతికేళ్ల సేవ ఒక ఎకరం భూమితో సమానం చేశావా? నీ కొడుకు కొరివి పెట్టేందుకు అడిగిన రెండెకరాల విలువకంటె నా పాతికేళ్ల సేవ తక్కువన్న మాట! ఒక్క క్షణం చేసే పని ముందు నా పాతికేళ్ల సేవ దిగదుడుపన్న మాట! నాకు ఏ ఆస్తి ఇవ్వకుంటా ఉంటే సంతోషించి ఉండేవాణ్ణి! కాని ఇలా తక్కువ చేస్తారనుకోలే!' పరంధామయ్యను ఆ కళ్ళు సూటిగా ప్రశ్నిస్తున్నట్లు అనిపించింది.

ఎకరం వ్రాసి రామన్నను కించపరిచి

నందుకు పరంధామయ్యగారు సిగ్గుతో తల దించుకున్నారు.

* * *

వాలు కుర్చీలో కూర్చుని చుట్టపొగ నెమ్మదిగా వదులుతూ ఆకాశంలో క్షణానికో రూపు దాల్చే మేఘాల్ని చూస్తున్నారు పరంధామయ్యగారు.

ఏ ఎండ కా గొడుగు మార్చే సమాజంలోని వ్యక్తుల్లా, విమిషానికో రంగు మార్చే ఊసరవెల్లిలా వివిధాకారా లెత్తుతున్నాయి మేఘాలు!

నిలకడలేని మేఘాలు ఆయన సంతానాన్ని గుర్తు చేస్తున్నాయి.

'ఆస్తి పంపకంలో తాను తప్పు చేశాడా?' అని ఆయనకు ఒక్కసారి అనిపించింది.

తృప్తిలేని మనుషులకు ఎంత ఇస్తే ఏం లాభం?

కమ్మని స్వచ్ఛమైన కాఫీ ఇచ్చినా, మిగిలిన నల్లని మడ్డి కూడా జుర్రుకోవాలనే ఆకాంక్ష!

తాను రెక్కల కష్టంమీద అహోరాత్రాలు కష్టపడి పనిచేసి కట్టించిన డాబా పెద్దకొడుకు, కోడలు దృష్టిలో బోడిడాబా అయింది.

సూర్యాన్ని తన భుజాలపై ఎత్తుకుని పెంచి పెద్దచేసిన రామన్న కూలిమనిషి అయ్యాడు. పరలోక సుఖ ప్రసాదియైన భగవంతుడు నిర్జీవ జడపదార్థ మయ్యాడు!

రెండవకొడుకుకు ఇంటి ఆడపడుచుకు ఆస్తి పంచిఇవ్వటం రుచించలేదు. ఆ ఆస్తిని కూడా తాను అనుభవించాలనే దురాశ! కాని తన భార్యకు రావలసిన వాటా రాయించుకున్న తరవాతనే కాపరానికి తీసుకువచ్చాడు! చెల్లెలి విషయంలో ఆ ధర్మం మార్పు రావాలి!

న్యాయాన్ని పరిరక్షించ వలసిన న్యాయవాది మనిషి కో న్యాయం పంచిపెట్టటానికి సిద్ధమయ్యాడు!

తనకు ఎనలేని అదృష్టం తెచ్చి పెట్టిన చెరుకుతోట, ఇప్పుడు తన సంతానం సుఖంగా జీవితాన్ని వెళ్లబుచ్చ టానికి కారణమైన చెరుకుతోట— సరళకు చొప్పతోట అయింది. అన్నయ్య లకు చిన్న దెబ్బ తగిలితే విలవిలలాడే సరళ అన్నయ్యల చదువులకే బోలెడు ఖర్చు చేశారని మూతి ముడుచుకుంది!

అన్నిటికంటె పెద్దకోడలు తన నెత్తిమీద కొరివి పెట్టేందుకు రెండెకరాలు ఎక్కువ వ్రాయాలనటం ఆయన హృదయాన్ని తూట్లు తూట్లుగా పొడిచింది!

వీళ్లెందుకు ఇంత స్వార్థపరులుగా మారిపోయారు?

డబ్బుపై వీళ్ల కెందు కింత మమకారం?

ఎందు కంత తీపి?

మమతలూ, మర్యాదలూ డబ్బు ముందు తల వంచుతాయా?

మానవునికంటె అతను సృష్టించిన డబ్బుకే ప్రాధాన్యమా?

అసలు తాను వీళ్ల కెందుకు తన ఆస్తి ఇవ్వాలి?

వారు చూపించే ఆప్యాయత తన మీద కానప్పుడు తన కష్టార్జితం ఎందుకు స్వార్థపరులపాలు చేయాలి?

వేరువేరు ఆలోచనలతో ఆయన మస్తిష్కం వేడెక్కిపోయింది.

ఆలోచనల్ని కట్టిపెట్టి ఒక నిశ్చయా నికి చేరుకున్నారు పరంధామయ్యగారు.

వ్రాసిన విల్లును కసితీరా ముక్కలు ముక్కలుగా చింపివేశారు.

ఆ రోజుకూడా అలవాటుపడ్డ శివరామయ్యగారు "అదృష్ట వంతుడ వోయ్!" అని ఆయన ఇచ్చిన పొగాకు కాడ రొంటిని పెట్టుకుని వెళ్లి పోయారు.

కానీ రోజులా పరంధామయ్యగారు చిరునవ్వుతో తల పంకించలేదు.

"అదృష్టవంతుడు!" అనే మాటను ఒక్కసారి మననం చేసుకున్నాడు.

మెల్లిగా చిరునవ్వు నవ్వాడు!

పిదప బిగ్గరగా, తరవాత దాదాపు పిచ్చివాడిలా నవ్వాడు! తరవాత వేదాంతిలా నవ్వినవ్వి స్పృహతప్పి పడి పోయాడు!

• • •

పరంధామయ్యగారు పోయి ఆవేళకి మూడవ రోజు.


ఆయన పోయిన సమయంలో కొడుకులు, కోడళ్లు, కూతురు, అల్లుడు దగ్గిరే ఉన్నారు.

పెద్దకొడుకు ఆయన గొంతుకలో పోసిన తులసితీర్థం విషానికి ఏమాత్రం తీసిపోలేనట్లుగా అనిపించింది పరంధామయ్యగారికి!

తన మంచం చుట్టూ చేరినవాళ్ల మొహాల్లో ఆయన వెళ్లిపోతున్నాడనే ఆందోళన ఉందో లేదోగాని, ఆస్తిని సరిగా పంచాడో లేదోనన్న భయం మాత్రం పరంధామయ్యగారు బాగా గమనించారు.

ఆస్తి గురించి పొంచిన ఆ మనుషుల్లోని రాబందులను ఆయన స్పష్టంగా చూడగలిగాడు.

వారు ఇంతకాలం చూపించిన ఆప్యాయత ఆస్తికోరకేనని ఆయన అస్థికలు గంగలో కలిసినప్పుడు ఆయన ఆత్మ తెలుసుకోలేకపోలేదు!




అతడు రసికుడు. తెలివి కలవాడు. భార్యని, వదుచు మరదలిని సినిమాకు తీసుకొని వెళ్లాడు. మరదలిని పక్కను కూర్చోబెట్టుకున్నాడు.

సినిమాలో ఒక ఘాటైన లవ్ సీను నడుస్తుండగా కావాలని మరదలిని ముద్దు పెట్టుకున్నాడు. తరవాత "క్షమించు, మరదలా. మీ అక్క అనుకుని పొరపాటున పశువులా ప్రవర్తించాను" అన్నాడు.

"ఫరవాలేదు. మీ సంగతి తెలుసు కదా. నేను ఈ సీట్లోకి మారి చాలా సేపయింది" అంది మరదలి సీట్లో ఉన్న అతగాడి భార్యామణి.

కూతురూ, అల్లుడూ పట్టిన పక్షిణి ఆయన ఆత్మ శాంతి ఇచ్చిందో లేదోగాని, లోకుల దృష్టి ఆకర్షించక పోలేదు!

* * *

'ఆ వ్రాసిన డాబా అయినా నా పేర వ్రాశారా అంటే అదీ లేదు! నా కొడుకుకు మైనారిటీ తీరినతరవాత వాడికి సంక్రమిస్తుందట!'

'ఎంతైనా తన పేరింటిగాడని మమకారం. మా మీద కోపం!' సూర్యం దంపతులు చనిపోయిన పరంధామయ్యగారిని మనస్సులోనే తిట్టుకున్నారు.

'ఆడపడుచుకు ఆస్తి ఇవ్వక్కర్లే దన్నానని నాకు మొదట పుట్టే ఆడపిల్ల పేర మాగాణి వ్రాసి, చచ్చిన తరవాత కూడా నా మీద కసి తీర్చుకున్నాడు ముసలాడు!' ప్రకాశం తండ్రి విల్లు చూసి మనస్సులోనే ఏడ్చాడు.

'తోట అమ్మేసి, ఆ డబ్బు చేతికి వచ్చేలా చేశారా అంటే అదీ లేదు. అది బాంకులో వేసి నా సంతానానికి మైనారిటీ తీరిన తరవాత వాళ్లకు సమానంగా సంక్రమించేటట్లు వ్రాశారు!' అనుకుంటూ నిస్పృహ చెందింది సరళ.

'ఎకరం రాస్తారని చాలా బెంబేలు పడిపోనాను. అది రాయలేదని తెలిసిం తరవాత చాలా చంతోసమైంది. కాని మద్దిలో ఇదో ఇరకాటం పెట్టేరేంటో? నాను ఆరికి సేసిన సేవ ఏం లేదు! నాకా సదువు రాదు! అయినా అయ్య గారికేటి నా మీద అంత ఇది!' పరంధామయ్యగారు తనను వారి ఆస్తి కంతటకు ట్రస్టీగా నియమించటంలో పరమార్థం తెలియక తికమక పడ్డాడు రామన్న.

కాని అదే సమయంలో "పరంధామయ్య కేమిటోయ్! అదృష్టవంతుడు. కన్నబిడ్డల చేతుల్లో హాయిగా కన్ను మూశాడు. వాళ్లకూడా సక్రమంగా అన్ని కర్మలూ ఆచరించారు. దేనికైనా పెట్టి పుట్టాలి!" అంటూ లోకులు పరంధామయ్య అదృష్టాన్ని మరోసారి—బహుశా చివరిసారి—శ్లాఘించారు!

కాని అవసానదశలో మానసిక వేదనతో కుమిలి కుమిలి, నలిగి, నశించిన పరంధామయ్య ఆత్మ ఇదంతా చూసి బిగ్గరగా నవ్వు కుంటూ 'లోకులు!. . . దూరపు కొండలు. . .' అంటూ గొంతెత్తి అరుస్తూ మరో లోకంలోకి పోవ టానికి వైతరణివైపు పరిగెత్తినదనే విషయం ఎవరూ గమనించలేదు! ★